వాటర్ వీక్ సదస్సుకు హాజరైన ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8వ ఇంటర్నేషనల్ వాటర్ వీక్ సదస్సు-2024ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. మంగళవారం నుంచి 4రోజులపాటు నిర్వహించే ఈ సదస్సుకు తెలంగాణ నుంచి నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. సదస్సులో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు పలు దేశాల, రాష్ట్రాల నీటి పారుదలశాఖ మంత్రులు, నీటి పారుదల రంగ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ జల వనరుల నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం చేస్తున్న కృషిని వివరించారు.

విశిష్ట సేవలకు రాష్ట్రస్థాయి అవార్డులు

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): వృద్ధులకు విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులు, సంస్థలకు వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ రాష్ట్రస్థాయి అవార్డులు అందించనున్నది. అర్హులైన వారు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం 5గంటల్లోపు హైదరాబాద్‌లోని వికలాంగుల సంక్షేమ భవన్ డైరెక్టరేట్‌లో దరఖాస్తును సమర్పించాలని, ఎంపికైన వారికి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలను అందించనున్నట్టు తెలిపారు. వివరాలకు 9652394751, 040-245590480 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏపీజీవీబీ సిబ్బంది వరదసాయం

రూ.65 లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : వరద బాధితుల సహాయం కోసం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) సిబ్బంది తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.65 లక్షల విరాళం అందించారు. సీఎం రేవంత్‌రెడ్డిని బ్యాంక్ చైర్మన్ కే ప్రతాపరెడ్డి, బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మక్కడ్, చైర్మన్, సెక్రటరీ ఆర్ యశ్వంత్ మంగళవారం కలిసి చెక్కు అందజేశారు.

• గంగమ్మ ఒడిలో మహా గణపతి

హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనమిస్తున్న ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతి

బైబై గణేశా!

హైదరాబాద్ సహా రాష్ట్రంలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతం

- రాష్ట్రవ్యాప్తంగా 35 వేల మందితో బందోబస్త్: డీజీపీ
- ట్రై కమిషనరేట్ల పరిధిలోనే లక్ష విగ్రహాల నిమజ్జనం
- మధ్యాహ్నం 1.37 గంటలకే గంగ ఒడికి మహాగణపతి
- కీర్తి రిచ్‌మండ్, బాలాపూర్ లడ్డూలకు రికార్డు వేలం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలో మంగళవారం గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. డప్పు చప్పుళ్లు, కోలాటం, భజనలు, యువకుల నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ వినాయకుడి శోభాయాత్ర అంతటా సందడిగా సాగింది. హైదరాబాద్ నగరంలోని రోడ్లు జాతరను తపలించాయి. భైంసా, ముథోల్, నారాయణపేట్, ఉట్కూర్, కరీంనగర్, మహబూబ్‌నగర్ పరిధిలో మధ్యాహ్నానికే విగ్రహాల నిమజ్జనం పూర్తయింది. జడ్చర్ల, తాండూర్, మక్తల్, నిర్మల్‌లో కూడా ప్రశాంతంగానే ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జన శోభాయాత్రకు 35 వేల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించినట్టు డీజీపీ జితేందర్ చెప్పారు. రాజధానిలో ట్రై కమిషనరేట్లకు 25 వేల మంది సిబ్బందిని కేటాయించినట్టు తెలిపారు. ట్రై కమిషనరేట్ల పరిధిలో సుమారు లక్ష వరకు విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతి శోభాయాత్ర ఉదయం 6.32 గంటలకు ప్రారంభంకాగా, భక్త జనసందోహం నడుమ నగర వీధుల గుండా 8 గంటలపాటు యాత్ర సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పర్యటించేందుకు రావడంతో పాత సచివాలయం గేటు వరకు వచ్చిన మహాగణపతి శోభాయాత్ర గంటసేపు నిలిచిపోయింది. సీఎం పర్యటన ముగిసిన తర్వాత శోభాయాత్ర ముందుకు సాగింది. సుమారు గంటసేపు భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వలంటీర్లు రోడ్లపైనే నిలబడిపోయారు. అనంతరం మధ్యాహ్నం 1.37 గంటలకు మహా గణపతి గంగమ్మ ఒడికి చేరడంతో 'మహా' ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనానికి అగ్నిమాపకశాఖ నుంచి మొత్తం 1,317 మంది సిబ్బందితో మోహరించినట్టు ఆ శాఖ అడిషనల్ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 126 వాటర్ టెండర్లు, 11 బోట్లు, 19 చిన్న అగ్నిమాపక వాహనాలు, 66 మిస్ట్ బుల్లెట్లు, 30 రెస్క్యూ రెస్పాన్స్ బృందాలతో విధులు చేపట్టినట్టు తెలిపారు. అత్యధికంగా హైదరాబాద్ నగరంలో 19 పెద్ద అగ్నిమాపక వాహనాలు, 16 మిస్ట్ బుల్లెట్లు, మూడు బోట్లు, 4 మినీ రెస్క్యూ టెండర్లు, 305 మంది సిబ్బందిని కేటాయించినట్టు చెప్పారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్దకు వేలాదికి తరలివచ్చిన భక్తుల తోపులాటతో పలువురు మహిళలు, వృద్ధులు గాయాలపాలయ్యారు. ఈ సమయంలో పోలీసులు లాఠీచార్జి చేశారు.

వేలం జరిగిన ప్రాంతం	లడ్డూలకు పలికిన ధర (రూ.లక్షల్లో)
బండ్లగూడ జాగీర్ కీర్తి రిచ్‌మౌండ్ విల్లా	187
బాలాపూర్	30.01
మాదాపూర్‌లోని మై హోంభుజ	29
కర్మన్‌ఘాట్ మాధవరం సెరినిటీ గేటెడ్ కమ్యూనిటీ	16.01
బడంగ్‌పేట	11.90
అత్తాపూర్ న్యూ స్టార్స్ భక్తసమాజ్	11.16
ఉప్పరిపల్లి వీరాంజనేయ భక్తసమాజ్ వినాయక మండపం	10
న్యూ నాగోల్ కాలనీ	6.81
రామంతాపూర్ లక్ష్మీగణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్	6.80

గణనాథుడి లడ్డూ @ 1.87 కోట్లు

కీర్తి రిచ్‌మౌండ్ విల్లా లడ్డూ వేలంలో ఆల్ టైం రికార్డ్

30.01 లక్షల రికార్డు ధర పలికిన బాలాపూర్ లడ్డూ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో లంబోధరుడి లడ్డూలకు ఏటేటా విలువ పెరుగుతున్నది. భక్తులు పోటీలు పడి మరీ వేలంలో లక్షలకు లడ్డూలను దక్కించుకుంటున్నారు. ఈసారి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీర్తీ రిచ్‌మౌండ్ విల్లాస్‌లో నిర్వహించిన వేలంలో గణనాథుడి లడ్డూని ఆల్‌టైం రికార్డ్ ధరకు సొసైటీ సభ్యులే సొంతం చేసుకున్నారు. రూ.1.87 కోట్లకు ఆ లడ్డూను వారు దక్కించుకున్నారు. నిరుడి కంటే రూ.62 లక్షల అధిక ధర పలికింది. బాలాపూర్ లడ్డూ నిరుడి కంటే రూ.3.01 లక్షల అధిక ధరతో రూ.30.01 లక్షలతో బాలాపూర్‌కు చెందిన కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. నగరవ్యాప్తంగా పలుచోట్ల లడ్డూల వేలం పోటాపోటీగా సాగి లక్షల ధర పలికింది.

జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్‌లో ఖాళీగా ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను చూపుతున్న రైతులు

కరెంట్ లేక ఎండుతున్న పొలాలు

- పక్షం రోజులైనా మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న అన్నదాతలు
- జనగామ జిల్లా కొండాపూర్‌లో రైతుల దీనస్థితి

చిల్పూరు, సెప్టెంబర్ 17: కరెంట్ లేకపోవడంతో నీరందక పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామంలో ఎస్‌ఎస్10 ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పదిహేను రోజులు కావస్తున్నా పట్టించుకోవడం లేదని జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్ గ్రామ రైతులు మంగళవారం 'నమస్తే తెలంగాణ' ఎదుట గోడువెళ్లబోసుకున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా మరమ్మతులు చేపట్టడం లేదని, కరెంటు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని, చివరికి తమకు ఆత్మహత్యలే దిక్కంటున్నారు. ఇప్పటికే 40 ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో మక్క పంట ఎండిపోయిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు స్పందించి సత్వరమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు.

విషజ్వరంతో మహిళ మృతి

సారమ్మ(ఫైల్)

టేకుమట్ల, సెప్టెంబర్ 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన రేణుకుంట్ల సారమ్మ (56) జ్వరంతో మరణించారు. సారమ్మకు శుక్రవారం జ్వరం రావడంతో పరకాలలోని ఓ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉన్నదని అక్కడి వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

'అంగన్‌వాడీ'లకు సకాలంలో అందని జీతాలు

- ఇబ్బందుల్లో టీచర్లు, ఆయాలు
- ఇలా అయితే కేంద్రాల నిర్వహణ ఎలా అంటూ ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్రాల నిర్వహణపై ప్రభావం పడుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు ఇబ్బందులెక్కువయ్యాయని వాపోతున్నారు. తమకు కూడా రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఆగస్టు వరకు ఐదు నెలలకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆగస్టులో వీటిని ప్రభుత్వం చెల్లించింది. ఇక సెప్టెంబర్‌లో రావాల్సిన జీతాన్ని మాత్రం ఇప్పటివరకూ చెల్లించలేదు. ఇవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ జీతాలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30వేల మందికిపైగా సిబ్బంది కోరుతున్నారు.

ఇన్‌స్టా టీనేజ్ ఖాతాలపై తల్లిదండ్రుల నిఘా!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: టీనేజర్లపై సోషల్ మీడియా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్న వేళ.. ఇన్‌స్టాలో టీనేజ్ ఖాతాలపై 'మెటా' చర్యలకు ఉపక్రమించింది. మంగళవారం ఈమేరకు సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇన్‌స్టాలో 18ఏండ్ల లోపు యూజర్ల విషయంలో గోప్యత, తల్లిదండ్రుల పర్యవేక్షణ మరింత పెంచేదిశగా సెట్టింగ్స్‌లో ఆప్షన్లు తీసుకొస్తున్నట్టు పేర్కొన్నది. 'టీన్ అకౌంట్స్'గా గుర్తించిన ఖాతాలన్నింటినీ 'ప్రైవేట్ అకౌంట్స్'గా మార్చుతున్నట్టు మెటా తెలిపింది. ఇందులో డీఫాల్ట్ సెట్టింగ్స్ మార్పులకు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. టీనేజర్లలో నిరాశ, ఆందోళన, ఇతర వైకల్యాలు అధిక స్థాయికి చేరుకోవడానికి సోషల్ మీడియానే కారణమని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మెటా, బైట్‌డ్యాన్స్(టిక్‌టాక్), గూగుల్ (యూట్యూబ్) కంపెనీలకు వ్యతిరేకంగా అమెరికాలో వందల సంఖ్యలో కోర్టు కేసులున్నాయి.

పండిట్లను పట్టించుకునే వారేరీ?

- తమను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని పండిట్ల ఆగ్రహం
- సమస్యలు పట్టించుకోవడం లేదని తీవ్ర ఆవేదన
- హామీల అమలులో మోదీ సర్కారు విఫలమైందని మండిపాటు

శ్రీనగర్, సెప్టెంబర్ 17: రాజకీయ పార్టీలు తమను కేవలం ఓటుబ్యాంకుగానే పరిగణిస్తున్నారని, తమ సమస్యలను పట్టించుకోవడం లేదని కశ్మీరీ పండిట్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న నిరుద్యోగం, గృహ నిర్మాణ సమస్యలను తక్షణం తీర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ తొలి దశ ఎన్నికలు బుధవారం జరుగనున్నాయి. ఈ క్రమంలో 1990లో జమ్ముకశ్మీర్ నుంచి మూకుమ్మడిగా వలస వెళ్లిపోయిన కశ్మీర్ పండిట్లు సుమారు 35 ఏండ్ల తర్వాత కూడా తాము అదే దుస్థితిలో ఉండటం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీలు తమ సమస్యలను తీర్చడంలో విఫలమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న అసాధ్య వాగ్దానాల పట్ల కశ్మీర్ పండిట్ల ప్రతినిధి బబ్లూ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు కేవలం తమను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, వారిచ్చిన వాగ్దానాలలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రిక్తహస్తాలు చూపుతున్నాయని అన్నారు. అదే సమయంలో ముస్లింలతో తమ సంబంధాలు పటిష్ఠంగా ఉన్నాయని తెలిపారు.

కేంద్రం హామీలు గాలికి..

కేంద్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని బబ్లూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వలసపోయిన కశ్మీర్ పండిట్లకు 6 వేల ఉద్యోగాలు, ఇళ్లు నిర్మించి ఇస్తామని మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే 2,500 గృహాలు మాత్రమే నిర్మించారని చెప్పారు. నాలుగేండ్లయినా మరో 2,500 ఇళ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని అన్నారు. తమను వెనక్కి రప్పించాలని ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఏడాదిలో దానిని పూర్తి చేసి ఉండేదని బబ్లూ పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయ నేతలకు కశ్మీరీ పండిట్లు గుర్తుకు వస్తారని సునీతా భాన్ అనే కశ్మీరీ పండిట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన అవకాశాలను వెతుక్కుంటూ అనేకమంది కశ్మీరీ పండిట్ల పిల్లలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారని గుర్తుచేశారు.

• మయన్మార్‌లో

'యాగి' కల్లోలం.. 236 మంది మృతి

నైపేయీ, సెప్టెంబర్ 17: 'యాగి' టైఫూన్ తాకిడికి మయన్మార్ విలవిల్లాడుతున్నది. భారీ వర్షాలు, వరదల కారణంగా కొండచరియలు విరిగి పడి.. ఇప్పటివరకు కనీసం 236మంది మరణించారు. సైనిక తిరుగుబాటుతో సంక్షోభంలో కూరుకుపోయిన మయన్మార్‌ను 'యాగి' టైఫూన్ మరింత దెబ్బతీసింది. రాజధాని నైపేయీ సహ పలు రాష్ట్రాల్ని వరదలు ముంచెత్తాయి. వరదల్లో దాదాపు 77 మంది గల్లంతయ్యారని ఆ దేశ ప్రభుత్వ మీడియా 'గ్లోబల్ న్యూ లైట్ ఆఫ్ మయన్మార్' మంగళవారం పేర్కొన్నది. వరదల కారణంగా 6,31,000 మంది నిరాశ్రయలయ్యారని తెలిపింది. వారం రోజుల క్రితం 'యాగి' టైఫూన్ ఫిలిప్పీన్స్‌లో తీరాన్ని తాకింది. దీంతో దక్షిణ చైనా, వియత్నాం, లావోస్, మయన్మార్, బంగ్లాదేశ్‌లలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. యాగి టైఫూన్ వియత్నాంలో అల్లకల్లోలం సృష్టించింది. పలు చోట్ల కొండచరియలు విరిగిపడగా.. కనీసం 59 మంది చనిపోయారు. బంగ్లాదేశ్‌లో మునుపెన్నడూ లేనంతగా లక్షలాది మంది వరదల్లో చిక్కుకుపోయారు. ఫిలిప్పీన్స్‌లో 11 మంది మృతిచెందారు.

జియో సేవలకు అంతరాయం

బెంగళూరు, సెప్టెంబర్ 17: భారత్‌లో అతి పెద్ద టెలికం సంస్థ అయిన రిలయన్స్ జియో డాటా కేంద్రంలో అగ్ని ప్రమాదం కారణంగా మంగళవారం దేశ వ్యాప్తంగా ఆ కంపెనీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. డౌన్‌డిటెక్టర్.కామ్ కథనం ప్రకారం 10 వేలకుపైగా జియో యూజర్లు తాము ఎదుర్కొన్న సమస్యలను ప్రస్తావించారు. సేవల అంతరాయ ప్రభావాన్ని ఎదుర్కొన్న యూజర్లలో సగానికిపైగా మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్, బ్రాండ్‌బ్యాండ్ తదితర సమస్యలను ఎదుర్కొన్నారు. చిన్న సాంకేతిక కారణాల వల్ల మంగళవారం ఉదయం తమ యూజర్లు కొంత మంది సమస్యలు ఎదుర్కొన్నారని.. సాయంత్రం 3.40కి సమస్యను పరిష్కరించి సేవలన్నీ పునరుద్ధరించామని జియో అధికార ప్రతినిధి తెలిపారు. ట్రాయ్ జూన్ నెలాఖరు గణాంకాల ప్రకారం జియోకు 48.9 కోట్ల చందాదారులు ఉన్నారు.

పూరీ జగన్నాథ ఆలయంలో ఎన్జీఆర్‌ఐ అధ్యయనం

- రత్న భండార్ ప్రాథమిక పరీక్షలో పాల్గొననున్న సంస్థ శాస్త్రవేత్తలు
- ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులతో కలిసి నేడు పరిశీలన



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఒడిశాలోని పూరీ జగన్నాథ ఆలయంలోని రహస్య భాండాగారాన్ని హైదరాబాద్‌లోని ఎన్జీఆర్‌ఐ శాస్త్రవేత్తల బృందం పరిశోధించనుంది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధకులు కూడా రత్నా భండాగారంలో ఉన్న గదులు, ఆభరణాలు, డిజైన్లను పరిశీలించనున్నారు. అయితే రత్నా భండాగారంలో అదనంగా రహస్య నేల మాళిగలు ఉన్నాయని, ఇందులో భారీ మొత్తంలో నిధినిక్షేపాలతో నిండి ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో.. వీటన్నింటిని సాంకేతికత ఆధారంగా అధ్యయనం చేయనున్నారు. అనంతరం పూరీ జగన్నాథ్ కమిటీకి నివేదికను అందజేయనున్నారు. సెప్టెంబర్ 18న జరిగే సమీక్షలో పలు అంశాలను పరిశీలించనున్నారు. ఆలయ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాదే సమక్షంలో.. ఏఎస్ఐ, ఎన్జీఆర్‌ఐ టెక్నికల్ బృందం రత్న భాండార్ నిర్మాణాన్నీ అంచనా వేయనుంది. జియో ఫిజికల్, లైటింగ్ పరికరాలను వినియోగించనుంది. జీపీఆర్(గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్) సర్వే ద్వారా అధ్యయనం చేసేందుకు కమిటీ బృందం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ని రూపొందించింది.

నిర్మాణాల నాణ్యతను తెలుసుకునేలా...

రత్న భండార్ నిర్మాణ నాణ్యతను తెలుసుకునేందుకు పరిశోధకులు అధ్యయనం చేయనున్నారు. నేల మాళిగల నిర్మాణం, ఐరన్ బీమ్స్ నాణ్యత, పై కప్పు, ప్రవేశ ద్వారాలు, స్టెయిన్‌లెస్ స్టీల్ బీమ్స్, గోడలపై ఉన్న పగుళ్లను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. దీని ఆధారంగా రత్న భండార్‌ల వినియోగం, ఆధునీకరణ వంటి అంశాలపై ఆలయ కమిటీ నిర్ణయం తీసుకోనుంది.

ఊహాగానాలకు చెక్...

పూరీ జగన్నాథ్ ఆలయంలో ఉన్న రత్న భండార్ విషయంలో ఎన్నో ఊహాగానాలు ఉన్నాయి. ఈ ఈ నేపథ్యంలో రత్న భండార్ గుట్టును సాంకేతికత ఆధారంగా తెలుసుకునేందుకు ఈ అధ్యయనం సాయపడనుంది. అదే విధంగా రత్న భండార్‌లోనే ఉన్న రహస్య గదులను కూడా తెలుసుకోవడం కోసం ఈ అధ్యయనం చేస్తున్నట్లుగా తెలిసింది. దీనికోసం ఇప్పటికే రత్న భండార్‌ను తెరిచిన బృందం... అందులో ఉన్న నిధులు, ఆభరణాలు, సంపద మొత్తాన్ని తాత్కాలిక గదుల్లోకి తరలించారు. కానీ రహస్య గదుల విషయంలో ఇప్పటికీ చర్చలు సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే వాటన్నింటికి చెక్ పెట్టేలా ఈ అధ్యయనం చేయనున్నారు.

దళితులపై మునిరత్న దుర్భాషలు

- ఆడియో టేప్స్ బయటకి
- చిక్కుల్లో కర్ణాటక బీజేపీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'వాల్మీకి కార్పొరేషన్' స్కామ్‌లో ఒకవైపు కాంగ్రెస్ సర్కారు పీకల్లోతు మునిగిపోయి ఉంటే, బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న దళితులపై దుర్భాషలాడిన ఆడియో టేపులు తాజాగా బయటపడటం కన్నడ రాజకీయాలను కుదిపేస్తున్నది. మునిరత్న తనను, తన కుటుంబంలోని మహిళలను కులం పేరిట దూషించినట్టు బృహత్ బెంగళూరు మహానగర పాలికకు చెందిన చెలువరాజు అనే కాంట్రాక్టర్ ఇటీవల ఆరోపించారు. కాంట్రాక్ట్ పనులకు లంచం ఇవ్వనందుకే మునిరత్న ఇలా చేసినట్టు ఆరోపించిన చెలువరాజు.. దుర్భాషలకు సంబంధించిన ఆడియో క్లిప్స్‌ను విడుదల చేశారు. మునిరత్న తనపై దాడి చేసినట్టు కూడా ఆరోపించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలుసుకొన్న మునిరత్న గత శనివారం ఏపీకి వెళ్లేందుకు యత్నించారు. పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం మునిరత్నను 14 రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీలో అంతర్మథనం

దళితులపై మునిరత్న చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీ నేతలు ఆచితూచి మాట్లాడుతున్నారు. ఈ విషయంపై కేంద్ర నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చిచెప్తున్నారు. 'మునిరత్నపై ఏ నిర్ణయాన్నైనా కేంద్ర నాయకత్వమే తీసుకోవాలి' అని కర్ణాటక బీజేపీ క్రమశిక్షణ కమిటీ ప్రెసిడెంట్ లింగరాజ్ పాటిల్ అన్నారు. వాల్మీకి స్కామ్ పేరిట కాంగ్రెస్ సర్కారును చిక్కుల్లో పెట్టాలనుకొన్న బీజేపీ పరివారానికి మునిరత్న వ్యవహారం కొత్త చిక్కులను తీసుకొచ్చినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

బీజేపీ మెడకూ 'ముడా' స్కామ్!

- బీజేపీ చీఫ్‌కు ముడా భూములు
- బినామీల పేరిట భూ ఫలహారం
- బీసీ ఫోరమ్ అధ్యక్షుడు శివరాము

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్న ముడా స్కామ్ బీజేపీ మెడకూ చుట్టుకొన్నట్టు కనిపిస్తున్నది. ముడా భూములను బినామీల పేరిట బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర చేజిక్కించుకొన్నట్టు కర్ణాటక బీసీ అవేర్‌నెస్ ఫోరమ్ ప్రెసిడెంట్ కేఎస్ శివరాము సంచలన ఆరోపణలు చేశారు. ఈ తతంగంలో బీజేపీ మైసూరు అధ్యక్షు డు ఎల్ఆర్ మహదేవస్వామి, ము డా మాజీ కమిషనర్ డీబీ నటేశ్ హస్తం కూడా ఉన్నట్టు తెలిపారు. రూ.7 కోట్ల విలువైన భూములను రూ.5.36 లక్షలకే బినామీల పేరిట విజయేంద్ర కొనుగోలు చేసినట్టు ఆరోపించారు.

నాకూ సీఎం కావాలని ఉంది: అజిత్‌పవార్

పుణే, సెప్టెంబర్ 17: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి నేతల్లో పదవుల కోసం ఆరాటం మొదలైంది. కూటమి నుంచి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ తొలిసారి తనకు ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న మక్కువను బహిరంగంగా వ్యక్తం చేశారు. తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలని ఆసక్తిగా ఉన్నట్టు చెప్పారు. పుణేలోని ప్రతిష్ఠాత్మక దగ్దుష్వేత్ హల్వాయ్ గణపతి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రతి వారు తమ నేత ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటారు. నేను కూడా ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నాను. అలా అని అందరి కోరికా నెరవేరదు. సీఎం కావాలంటే మెజారిటీ సీట్లు రావాలి. అదంతా ప్రజల చేతుల్లో ఉంది. ముఖ్యంగా 145 మ్యాజిక్ ఫిగర్ పొందడం చాలా అవసరం' అని అన్నారు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

21 నుంచి మోదీ అమెరికా పర్యటన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆయన క్వాడ్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. నాలుగో క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశం విల్మింగ్టన్‌లో 21న ప్రారంభమవుతుందని, దీనికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా విచ్చేస్తారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ ఏడాది క్వాడ్ సమ్మిట్‌ను నిర్వహించే బాధ్యత భారత్‌దని, అయితే తామే ఈసారి దానిని నిర్వహిస్తామంటూ అమెరికా చేసిన అభ్యర్థన మేరకు ఈ సమావేశాన్ని 2025లో నిర్వహించడానికి భారత్ అంగీకరించినట్టు ఆ శాఖ ప్రతినిధి చెప్పారు. పర్యటనలో భాగంగా 22న న్యూయార్క్‌లో మోదీ స్థానిక భారతీయులను కలిసి మాట్లాడుతారు. 23న సమావేశం ఆఖరి రోజు న్యూయార్క్‌లోని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్'పై ప్రసంగిస్తారు. ఈ పర్యటనలో ప్రధాని పలు యూఎస్ కంపెనీల సీఈవోలతో సమావేశమై సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించనున్నారు.